క్లుప్తంగా

కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి చేయండి



నర్సాపురం పీహెచ్‌సీలో ఆశా వర్కర్లకు సూచనలిస్తున్న లెప్రసీ స్టేట్ టీం సభ్యులు

రుద్రవరం: కుష్టు వ్యాధిని నిర్మూలించేందుకు అందరు కృషి చేయాలని గుంటూరు నుంచి వచ్చిన స్టేట్ టీం సభ్యులు జయరాం కృష్ణ అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని నర్సాపురం పీహెచ్‌సీని సందర్శించి సిబ్బంది, ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో 2022–23లో లెప్రసి కేసులు 136 ఉండేవని, 2023–24కు 98 కేసులు మాత్రమే ఉన్నాయని తెలిపారు. అయితే కేసులు తగ్గడంపై పలు అనుమానాలు ఉన్నప్పటికీ వాటిని నిర్ధారించేందుకు శాంపిల్ సర్వే చేపట్టాల్సి ఉందని చెప్పారు. ఈ నెల 27 నుంచి జనవరి 12 వరకు ఎల్‌సీడీసీ సర్వే నిర్వహించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా లెప్రసీ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్, పీహెచ్‌సీ వైద్యులు బాబు తదితరులు ఉన్నారు.

ఆళ్లగడ్డ మార్కెట్ కమిటీ పదవీ కాలం పొడిగింపు

నంద్యాల(సెంట్రల్): రాష్ట్ర వ్యాప్తంగా పదవీ కాలం ముగిసిన పలు వ్యవసాయ మార్కెట్ కమిటీల గడువును పెంచుతూ ప్రభుత్వం వరుసగా ఆదేశాలు జారీ చేస్తోంది. కాగా, జిల్లాలోని ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ కమిటీ కాల పరిమితి గత నెల 22న ముగిసింది. దీంతో ప్రభుత్వం ఈ కమిటీ కాల వ్యవధిని మరో ఆరు నెలలు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి జీఓ నంబరు 856 విడుదల చేశారు.

వినికిడి లోపం విద్యార్థులకు దుస్తుల పంపిణీ



దుస్తులను అందజేస్తున్న అధ్యక్షుడు తులసీకృష్ణ

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని శ్రీ పబ్బుతులసీ కృష్ణ పద్మశాలీ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం వినికిడి లోపం ఉన్న పిల్లలకు దుస్తులను పంపిణీ చేశారు. అధ్యక్షుడు పబ్బుతులసీ కృష్ణ మాట్లాడుతూ ఎన్‌జీఓ కాలనీలోని నవచైతన్య ఫ్రీ స్కూల్ ఫర్ ద హియరింగ్ ఇంపైర్డ్ పాఠశాలను సందర్శించామన్నారు. అందులో వినికిడి లోపంతో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు తనవంతు సాయంగా దుస్తులను ఒక్కొక్కరికి రెండు జతల దుస్తులను అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రేణుకాదేవి, పినాకపాణి పాల్గొన్నారు.

ఆదర్శ ఆర్టీసీ ఉద్యోగులకు ప్రోత్సాహకాలు



కండెక్టర్ డీఎన్ఎస్ రాయుడుకు ప్రశంసా పత్రం అందజేస్తున్న డిపో మేనేజర్ గంగాధర్

నంద్యాల టౌన్: నంద్యాల ఆర్టీసీ డిపోలో నవంబర్ – 2023 నెలలో ఉత్తమ ప్రతిభ కనపరచిన ఉద్యోగులకు నంద్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ గంగాధర్ రావు అభినందించారు. బుధవారం డిపో ఆవరణలో ఉత్తమ ప్రతిభ కనపరచిన కండెక్టర్లు డీఎన్ఎస్ రాయుడు, శేషన్న రామయ్య, రాజు, మల్లికార్జున, డ్రైవర్లు నాగన్న, వలి, శేఖర్, ప్రసాద్, భాస్కర్ లను అభినందించి ప్రశంశ పత్రాలు, ప్రోత్సాహకాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమయ పాలన పాటిస్తూ ప్రయాణికులను క్షేమంగా గమ్య స్థానాలకు చేర్చిన వారిని అభినందిస్తూ ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ మద్దిలేటి, స్టేషన్ మేనేజర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు.. భవితకు నిరోధకాలు

ఆళ్లగడ్డ: బాల్య వివాహాలు బాలికల బంగారు భవిష్యత్తుకు నిరోధకాలని ఐసీడీఎస్ అధికారులు దీప్తి, పార్వతి అన్నారు. బాల్య వివాహాల నిషేధ చట్టంపై బుధవారం పట్టణంలో ప్రభుత్వ పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చేసుకున్న వారితో పాటు సహకరించిన వారికి శిక్షత ప్పద న్నారు. మహిళా సంరక్షణ కార్యదర్శులు రమాదేవి, సాగర్‌కుమారి పాల్గొన్నారు.

పోలీ పాడ్యమి పూజలు

నంద్యాల(వ్యవసాయం): కార్తీక మాసం చివరి రోజు బుధవారం తెల్లవారుజామున మహిళలు పోలీపాడ్యమి స్నానాలు ఆచరించి, దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునే మహిళలు స్థానిక చెరువుకట్ట, కుందూనదుల స్నానాలు ఆచరించి అరటి దొప్పలలో నెయ్యి ఒత్తులతో దీపాలు వెలిగించారు. అనంతరం హారతులు ఇచ్చారు. వేదపండితులు మాడుగుల సుబ్రహ్మణ్య శాస్త్రి పోలీ పాడ్యమి విశిష్టతను వివరించారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

- అర్హులందరికీ సంక్షేమ ఫలాలు
- ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి
- బత్తలూరులో 'గడప గడపకు మన ప్రభుత్వం'



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ : ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన మొదలు పెట్టిన రోజునుంచే ఎన్నికలకు ముందు చెప్పినట్లుగా అర్హతే ప్రామాణికంగా ప్రతి పేదవారికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని.. దీంతో మళ్లీ ఆయనే సీఎంగా కావాలని ప్రతి ఒక్కరూ ఆకాక్షిస్తున్నారని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యాక్రమంలో భాగంగా బుధవారం బత్తలూరు సచివాలయం పరిధిలోని నందింపల్లె, బృందావనం, బత్తలూరు గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఈ ప్రభుత్వంలో ఇప్పటి వరకు ఒక్కో కుటుంబానికి ఏఏ పథకాల ద్వారా ఎంత మేర లబ్ధి చేకూరిందనే విషయాన్ని ఎమ్మెల్యే స్వయంగా వివరించారు. అలాగే ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

హామీలు నెరవేర్చాం కాబట్టే ధైర్యంగా తిరుగుతున్నాం..

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు దాదాపు 99 శాతం నెరవేర్చడంతో నేడు ధైర్యంగా గడగడపకూ తిరుగుతూ గర్వంగా ఇవి చేశామని చెప్పగలుగుతున్నామని ఎమ్మెల్యే అన్నారు. చరిత్రలో పార్టీలు, కులాలు, మతాలు, వర్గాలకు అతీతంగా ఎవరి సిఫారసూ లేకుండా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, సర్పంచ్ చెంచమ్మ, ఎంపీటీసీ సాల్‌మెన్, నాయకులు సుబ్బయ్య, ప్రతాపరెడ్డి, పుల్లారెడ్డి, రమణారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, నారాయణ, గోపాల్ నాయుడు బాలరాజు, వెంకటేశ్వర్‌రాజులు ఉన్నారు.

క్రీడాకారులకు ఆహ్వానపత్రికలు



క్రీడాకారుడికి ఆహ్వానపత్రికను అందజేస్తున్న జేసీ

నంద్యాల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈనెల 15వ తేదీ నుంచి నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్ర టోర్నమెంట్‌కు సంబంధించి నంద్యాల జిల్లాలోని క్రీడాకారులు, స్పోర్ట్స్ అంబాసిడర్లకు జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి ఆహ్వాన పత్రికలను బుధవారం జేసీ చాంబర్‌లో అందజేశారు. నంద్యాల జిల్లాలోని అంతర్జాతీయ స్థాయి, జాతీయస్థాయి మరియు రాష్ట్ర స్థాయి క్రీడాకారులకు ఆహ్వాన పత్రికలను అందజేశారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ మాధవి, సీఈఓ సత్యేందర్‌సింగ్

చాగలమర్రి: మండలంలోని చింతలచెరువు గ్రామంలో గ్రామ ప్రజల సౌకర్యార్థం ప్రముఖ సీడ్స్ కంపెనీ క్రిష్టల్ క్రాప్ ప్రోడక్షన్ లిమిటెడ్ కంపెనీ రూ.7.22 లక్షల వ్యయంతో ఆర్.ఓ.వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి గ్రామ పంచాయతీకి అప్పగించింది. వాటర్ ప్లాంట్‌ను బుధవారం ఆ కంపెని సీఈఓ సత్యేందర్‌సింగ్ స్థానిక సర్పంచ్ మాధవీతో కలిసి ప్రారంభించారు. సీఈఓ మాట్లాడుతూ చింతలచెరువు, మూడురాళ్లపల్లె, కోలుములపేట గ్రామాలకు చెందిన రైతులు తమ కంపెనీకి చెందిన సీడ్స్‌ను పండించి మార్కెట్‌కు భారీగా పంపిణీ చేస్తున్నారన్నారు. కంపెనీకి సహకరిస్తున్న రైతులకు మేలు చేయాలన్న ఉద్దేశంతో స్థలంతోపాటు వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి గ్రామ పంచాయతీ పేరిట రిజిస్ట్రేషన్ చేయించామన్నారు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను గ్రామ సర్పంచ్ మాధవికి అందజేశారు. కార్యక్రమంలో సిజెంటా జిల్లా ఆర్గనైజర్, వైఎస్సార్‌సీ నేత జనార్దన్‌రెడ్డి, కంపెనీ ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు



గెలుపొందిన కర్నూలు జిల్లా జట్టు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని ఎస్‌డీఆర్ పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి అండర్–14 క్రికెట్ పోటీలు బుధవారం హోరాహోరీగా సాగాయి. ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శివకుమార్ మాట్లాడుతూ అండర్–14 క్రికెట్ కర్నూలు జిల్లా జట్టు లీగ్ మ్యాచ్‌లో వెస్ట్ గోదావరి జిల్లా జట్టుతో తలపడిందన్నారు. కర్నూలు జట్టు 153 పరుగులు చేయగా, వెస్ట్ గోదావరి జట్టు 54 రన్స్ మాత్రమే చేయగలిగింది. దీంతో 99రన్నులు తేడాతో కర్నూలు జట్టు విజయం సాధించిందని తెలిపారు. విజయం సాధించిన ఉమ్మడి జిల్లా జట్టును ఎస్‌డీఆర్ పాఠశాల చైర్మన్ కొండారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి బత్తులరవికుమార్, తదితరులు అభినందించారు.

19న నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎర్రగుంట్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిరుద్యోగ యువతీ యువకులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రతాపరెడ్డి బుధవారం తెలిపారు. ఈనెల 19వ తేదీన ఉదయం 9.30గంటలకు ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయన్నారు. ఆటో మొబైల్ కంపెనీ, టాటా ఎలక్ట్రానిక్స్, విట్రో్డ్రగ్స్ కంపెనీలు పాల్గొంటాయన్నారు. అభ్యర్థులు పదవ తరగతి, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ, బీటెక్, పీజీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. అభ్యర్థులకు విద్యార్హత పత్రాలతో పాటు ఆధార్‌కార్డు, రెండో ఫొటోలతో హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం సెల్ : 94402 24291ను సంప్రదించాలన్నారు.

బాకాయిలు చెల్లించాలి

నంద్యాల టౌన్: ఆర్టీసీ ఉద్యోగస్తులకు రావలసిన బకాయిలు త్వరగా చెల్లించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ సెక్రటరీ సుబ్బరాజు డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ ఉద్యోగులు బుధవారం నంద్యాల డిపో ఎదుట ఎన్‌ఎంయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. మెరుగైన పెన్షన్ పథకంలో చేర్చాలని, 1/ 2019 సర్క్యులర్ ప్రకారమే కేసులకు సంబంధించిన ఆపిల్స్ కు విధివిధానాలు అమలు పరుస్తూ.. పరిమితి లేని వైద్య సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మల్లారెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, గ్యారేజీ సెక్రటరీ ఎస్ ఎండి రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే

నంద్యాల(అర్బన్): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ వర్గీకరణ చేపట్టాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని ఎంఆర్‌పీఎస్ నంద్యాల జిల్లా ఇన్‌చార్జ్ సుభాష్ చంద్ర మాదిగ, మాదిగ ఉద్యోగుల సమాఖ్య జాతీయ నాయకులు నరసింహులు మాదిగలు అన్నారు. స్థానిక నిశాంత్ భవన్‌లో బుధవారం ఎమ్మార్పీఎస్ నాయకుల సమావేశం మాదిగ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బాయికాటి బెనర్జీ మాదిగ అధ్యక్షతన నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోరుతూ వచ్చే ఏడాది జనవరి మాసంలో లక్షమందితో అమరావతిలో మాదిగల కురుక్షేత్ర మహాసభను నిర్వహిస్తున్నామని చెప్పారు. సభకు లక్షలాదిగా మాదిగలు తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దస్తగిరిమాదిగ, శివలింగం మాదిగ, రాము మాదిగ, కత్తి ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): ఆటోడ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బుధవారం బొమ్మలసత్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆటో డ్రైవర్లతో కలిసి ఆందోళన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. భారీగా పెనాల్టీలు పెంచుతూ విడుదల చేసిన జీవోను రద్దు చేయాలని కోరారు. ఆటో యూనియన్ నాయకులు అబ్దుల్‌కలాం, అబ్దుల్‌రహిమాన్, శ్యాంప్రసాద్, బ్రహ్మంరెడ్డి, కాశీం పాల్గొన్నారు.

వేలం పాట వాయిదా

శిరివెళ్ల: శ్రీ సర్వ నరసింహస్వామి ఆలయంలోని తలనీలాల సేకరణ బహిరంగ వేలం పాట వాయిదా పడింది. బుధవారం ఆలయ చైర్మన్ రేవనూరు రామాంజనేయరెడ్డి అధ్యక్షతన వేలం పాట జరిగింది. అయితే ప్రభుత్వం నిర్ణయించిన ధర పలుకకపోవడంతో అధికారులు వేలం పాటను వాయిదా వేశారు. గతేడాది రూ.5.1లక్షల పాట రాగా ఈ ఏడాది కేవలం రూ.3.20లక్షల వద్ద ఆగిపోయింది. వేలం పాట మూడోసారి వాయిదాపడిందని ఈఓ నరసయ్య తెలిపారు. మళ్లీ ఈ నెల 18న వేలం నిర్వహిస్తామన్నారు.

18న చిరువ్యాపారుల జిల్లా మహాసభ

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 18న నిర్వహిస్తున్న చిరువ్యాపారుల సంక్షేమ సంఘం జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు రహీం, అధ్యక్షుడు సత్యనారాయణ గుప్త పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రోజువారి గేట్లు ఎత్తివేత, వడ్డీలేని రుణాల మంజూరు, చిరువ్యాపారులు గౌరవంగా వ్యాపారం చేసుకునేలా ప్రభుత్వ స్థలాలు కేటాయించడం, సొంత ఇల్లు లేని వారికి ప్రభుత్వం ఇల్లు మంజూరు చేయాలని కోరారు. చిరువ్యాపారులు తోపుడు బండ్లు, బుట్టల వ్యాపారులు, ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేసే వారు తదితర వ్యాపారులందరూ హాజరై సభను విజయవంతం చేయాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

గ్రామీణ తపాలా ఉద్యోగుల సమ్మె

చాగలమర్రి : మండలంలోని గ్రామీణ తపాల ఉద్యోగులు, గ్రామీణ్ డాక్ సేవక్‌లు తమ డిమాండ్ల సాధనకు నిరవధిక సమ్మెకు దిగారు. బుధవారం మండల కేంద్రంలోని సబ్ పోస్టాఫీసు కార్యాలయం ఎదుట ప్లకార్డులు ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ తపాల ఉద్యోగులకు 8 గంటల పనితో సహా అన్నీ ప్రయోజనాలు మంజూరు చేయాలన్నారు. జీడీఎస్ మండల అధ్యక్షుడు ఏసేపు, సెక్రటరీ పి.చైతన్యకుమార్, పినాకినిరెడ్డి, మంజునాథరెడ్డి, రవి పాల్గొన్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరిస్తాం



మురుగు కాల్వను పరిశీలిస్తున్న కమిషనర్

నంద్యాల(సిటీ): పట్టణంలోని సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని సంజీవ నగర్, పద్మావతి నగర్ ప్రాంతాల్లో పర్యటించిన పలు సమస్యలకు పరిష్కారం చూపారు. వార్డులలో శానిటేషన్, డ్రింకింగ్ వాటర్, ఇతర సమస్యలు పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. కమిషనర్ వెంట ఎంహెచ్‌ఓ డాక్టర్ అంకిరెడ్డి, ఎంఈ రమణ మూర్తి, శానిటరీ సూపర్ వైజర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రకు 2094 మంది నమోదు

ఉయ్యాలవాడ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఆడుదాం ఆంధ్ర క్రీడలకు మండలంలో 2,094 మంది క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులతో క్రీడా పోటీలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ నెల 15 నుంచి సచివాలయ పరిధిలో 19వ తేదీ వరకు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందన్నారు. పురుషులు 1566 మంది, మహిళలు 528 మంది క్రీడల్లో పాల్గొనేందుకు నమోదు చేసుకున్నారని చెప్పారు.

క్రీడా పరికరాల పంపిణీ

దొర్నిపాడు: ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలకు సంబంధించిన కిట్లను ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి బుధవారం గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. సచివాలయం, మండల, నియోజకవర్గం, జిల్లా, రాష్ట్రస్థాయిలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బాడ్మింటన్, క్రికెట్, యోగా వంటి వాటిని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్బారెడ్డి, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు పంచాయతీ కార్యదర్శులు నాగార్జున, మాలతి, ఉసేనయ్య, వెంకటనారయణ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శక పాలనకు మళ్లీ పట్టం కట్టండి

నంద్యాల(సిటీ): సంక్షేమ పథకాలను ప్రజలందరికీ అందిస్తున్న పాదర్శక పాలనకు మళ్లీ పట్టం కట్టాలని 40వ వార్డు కౌన్సిలర్, మున్సిపల్ వైస్ చైర్మన గంగిశెట్టి శ్రీధర్ అన్నారు. బుధవారం వార్డు పరిధిలోని బైర్మల్ వీధిలో వార్డుకు పోదాం కార్యక్రమాన్ని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా వార్డులో జరిగిన అభివృద్ధి, సంక్షేమాలకు సంబంధించిన డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గంగిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ ఫలాలను అందించడంలో వైఎస్సార్‌సీపీ అందించిన పారదర్శకత ఇంకెవ్వరూ అందించలేదన్నారు. నాలుగున్నరేళ్లలో జరిగిన మంచిని వివరించారు. మరోమారు పేదలకు అండగా నిలిచే పార్టీకి భారీ ఎత్తున ఓట్లతో మద్దతివ్వాలని కోరారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాడుతామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగరాజు, తోటమద్దులు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నిర్మలమ్మ అన్నారు. నంద్యాలలో చేపట్టిన సమ్మె బుధవారం రెండవ రోజు కొనసాగింది. సమ్మెకు సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు ఎస్.శంకర్, చౌడప్ప, పీడీఎస్ నాయకులు రఫీ తదితరులు మద్దతు ఇచ్చారు.

గోస్పాడు: అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ సంఘం నాయకురాళ్లు నిర్మలమ్మ, రమణమ్మ డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన గోస్పాడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఆదిలక్ష్మి, భూలక్ష్మి, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

రుద్రవరం: మండలంలోని అంగన్‌వాడీ వర్కర్లు రెండో రోజు బుధవారం తమ దీక్షను కొనసాగించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద శిబిరంలో కూర్చొని తమ నిరసన తెలిపారు. పలు సంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

ఉజ్వల పథకంతో ఉచితంగా గ్యాస్ కనెక్షన్



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

దొర్నిపాడు: ఉజ్వల పథకం ద్వారా రేషన్ కార్డు కలిగిన మహిళలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్ ఇస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె, డబ్ల్యూ కొత్తపల్లె గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్రను సర్పంచులు బాలయ్య, అభిలాష్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. పూర్తి వివరాలకు ఏజెన్సీలను సంప్రదించాలన్నారు. అనంతరం పీఎం కిసాన్, ఆయుశ్మాన్ భారత్, అటల్ పెన్షన్ యోజన, పీఎంజేవై, పీఎం ఆవాస్ యోజన్, పొదుపు రుణాలు, తదితర వాటిని ఎల్‌ఈడీ టీవీ ద్వారా చూపించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జాకీర్ బాషా, శాంతయ్య, డీలర్ పెద్దన్న, చిన్నమద్దిలేటి, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఆర్డీ పీవీవీఎస్ మూర్తి

నంద్యాల(సిటీ): నంద్యాల పట్టణ సచివాలయాల పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న సెక్రటరీలు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని ఆర్డీ(రీజనల్ డైరెక్టర్) అనంతపురం, పీవీవీఎస్ మూర్తి అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కొత్తగా మున్సిపాలిటీలో విశితమైన నంద్యాల మండల పరిధిలోని పొన్నాపురం, వెంకటేశ్వరపురం, ఊడుమాలపురం సచివాలయాల సిబ్బంది విధులలో అలసత్వం వీడాలన్నారు. వార్డు పరిధిలోని ప్రజలకు పథకాల లబ్ధిని వివరించి ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ మురళీ కళ్యాణి, ఎంపీడీఓ సుగుణశ్రీ, అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు పాల్గొన్నారు. అనంతరం మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించి ఆర్డీ సంబంధిత శాఖల పురోగతి పై సమీక్షించారు.

రైతులు విచారణకు తప్పక హాజరు కావాలి

గోస్పాడు: 167కే నేషనల్ హైవేకు సేకరించిన పొలాలకు సంబంధించిన రైతులందరూ గురువారం నిర్వహించే 3జీ అవార్డు విచారణకు తప్పని సరిగా హాజరు కావాలని తహసీల్దార్ విజయశేఖర్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ఐదు గ్రామాల పరిధిలో నంద్యాల–జమ్మలమడుగుకు నేషనల్ హైవే రహదారి 167కే ఏర్పాటుకు భూముల సేకరణ చేసినట్లు తెలిపారు. మండలంలోని ఎం.చింతకుంట్ల 10.903 ఎకరాలు, జూలేపల్లె 12.119 ఎకరాలు, పసురపాడు 20.929 ఎకరాలు, గోస్పాడు 32.454 ఎకరాలు, ఒంటివెలగల 16.959 ఎకరాల భూమిని సేకరించనున్నట్లు చెప్పారు. ఇందులోని ఐదు గ్రామాల పరిధిలో 612 మంది రైతులకు చెందిన 93.164 ఎకరాల భూమి ఉందని తెలిపారు. రైతులందరూ పొలాలకు సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకాలు, ఇల్లు, స్థలాలకు సంబంధించిన డాక్యుమెంట్లు, ఈసీ, బ్యాంకు అకౌంట్, ఆధార్‌కార్డు రెండు ఫొటోలు వెంట తెచ్చుకోవాలని సూచించారు. గోస్పాడులోని తహసీల్దార్ కార్యాలయం వద్ద విచారణ ఉందుందన్నారు.

ప్రతి వాహనదారుడు లైసెన్స్ కలిగి ఉండాలి

దొర్నిపాడు: ప్రతి వాహనదారుడు తప్పని సరిగా లైసెన్స్ కలిగి ఉండాలని, లేదంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తిరుపాల్ హెచ్చరించారు. బుధవారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. అలాగే ఎవరి హద్దుల్లో వారే స్టాండ్లను ఏర్పాటు చేసుకొని గొడవలు పడకుండా పద్ధతిగా నడుపుకోవాలన్నారు.

వంద పనిదినాలు పూర్తి చేయండి

ఉయ్యాలవాడ : జాతీయ ఉపాధి హామీ పథకంలో వంద రోజుల పని దినాలు పూర్తి చేసుకునేలా క్షేత్రస్థాయిలో కూలీలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధి సిబ్బందిపై ఉందని ఏపీఓ రవిప్రకాష్ అన్నారు. బుధవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కులాలలో 81 నుంచి 99 రోజుల మధ్య పని దినాలు మిగిలిపోయిన వారందరని 100 రోజులు పూర్తి చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు.

పంటలు కళకళ .. పుడమి మిలమిల



ఆర్.పాంపల్లె సమీపంలో విరగ్గాసిన ఎర్రజొన్న



ఉయ్యాలవాడ సమీపంలో పచ్చగా శనగ పైరు

కొండుపల్లె సమీపంలో పూతతో కనువిందు చేస్తున్న కంది పంట



ఉయ్యాలవాడ : మండలంలో రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలు పచ్చదనంతో పుడమికి పచ్చటి రంగు వేసినట్లుగా కనువిందు చేస్తున్నాయి. ప్రస్తుతం మెట్ట పంటలు సాగు చేసిన రైతుల ముఖాల్లో ఆశలు చిగురుస్తున్నాయి. మండల పరిధిలో పప్పుశనగ 28 వేల ఎకరాలు, పొగాకు 80, జొన్న 250, కంది 120, మినుము 120, మొక్కజొన్న 200 ఎకరాల విస్తీర్ణంలో సాగయ్యాయని వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్ తెలిపారు.

స్టాళ్ల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోండి

నంద్యాల(సెంట్రల్): నంద్యాల పట్టణంలోని శ్రీనివాసనగర్ రైతు బజార్‌లో 57 కూరగాయల స్టాళ్లు ఖాళీగా ఉన్నట్లు జిల్లా అగ్రిట్రేడింగ్ మార్కెటింగ్ అధికారి అబ్దుల్ రహిమాన్ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆసక్తి కలిగిన రైతులు, వ్యాపారులు వీటిని బాడుగకు తీసుకుని తమ ఉత్పత్తుల్ని అమ్ముకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకోదలచిన వారు తన కార్యాలయ సిబ్బందిని సంప్రదించి సహాయం పొంద వచ్చన్నారు.